# ఆయనతో అనుసంధానమై ఉండండి

కమలేష్ డి పటేల్

ఆదివారం సత్సంగం తరువాత చేసిన ప్రసంగం

మార్చి 29, 2015, ఇండియా

నమస్తే,

మన ప్రియతమ గురుదేవులు సంవత్సరానికి మూడు ఉత్సవాలు జరుపుకోటానికి అనుమతినిచ్చారు: పూజ్య లాలాజీ మహారాజ్, బాబూజీ మహారాజ్, మన గురుదేవుల జన్మదినోత్సవాలు. ఈ ఉత్సవాలన్నిటినీ మన హృదయాల్లో జరుపుకోటానికి మనం ఎప్పుడూ సంసిద్ధంగానే ఉంటాం, కాని బాహ్యంగా ఉండే ఇతరమైన చాలా కారణాల వల్ల ఒక్కోసారి పాల్గొనడం కుదరకపోవచ్చు. అటువంటి ఉత్సవాల్లో, భండారాల్లో జరిగే సంత్సంగాల్లో పాల్గొనలేకపోతున్నందుకు మనకు అపరాధభావం కలుగవలసిన అవసరం లేదు. మీరు ఇంట్లోనే జరుపుకోగలిగితే జరుపుకోండి. ఒకవేళ వెళ్ళలేకపోయినట్లయితే, నిరాశపడకండి దయచేసి. మీ హృదయం ఉండవలసిన స్థితిలోనే ఉంది. మీ భార్య గాని, భర్త గాని, మీ తల్లిదండ్రులు గాని, భండారాకి వెళ్ళడానికి అంగీకరించడం లేదని మనసు పాడు చేసుకోకండి. లేక మీ ఆర్థిక పరిస్థితులు బాగోలేక గాని, మరే ఇతర పరిస్థితులైనా సరే అనుకూలంగా లేకపోతే నిరాశపడకండి. కారణం ఏదైనా కాని మిమ్మల్ని మీరు బలవంత పెట్టుకోకండి, దయచేసి. అందరికీ భండారాల్లో పాల్గొనడం సాధ్యం కాదు.

మనం ఎక్కడున్నామో అక్కడికే మాస్టరును ఆహ్వానించుకోవచ్చు. "ప్రియమైన గురుదేవా, నేను నా పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నాయో నేను చెప్పలేను, గాని మనం ఇక్కడే, ఇప్పుడే, దయచేసి ఈ ఉత్సవాన్ని జరుపుకుందాం" అని మీ హృదయ లోలోతుల్లో నుండి ఆహ్వానించుకోవచ్చు. మన హృదయాలు ఆ విధంగా అర్థించినప్పుడు మన మాస్టర్లు సంపూర్ణంగా మనతో ఉంటారు. అందుకే మన హృదయాలను సిద్ధం చేసుకొని ఆయనతో అనుసంధానమై ఉండాలి, అది ఈ భండారా కావచ్చు లేక మరో భండారా కావచ్చు. ఎందుకంటే భండారా అనేది మనం సాధించవలసిన చాలా చిన్న లక్ష్యం. ఇది చాలా చిన్ని ఆధ్యాత్మికాభిలాష. మన మాస్టర్లతో ఎల్లవేళలా అనుసంధానమై ఉండాలన్నదే మన ఉన్నతమైన ఆదర్శమై ఉండాలి. మనం ఎలాగైతే ఉదయం ధ్యానం చేసుకొన్న తరువాత రోజంతా ధ్యాన స్థితిలో ఉంటామో, అలాగే భండారాలు సంవత్సరానికి మూడే ఉండవచ్చుగాక, కాని మనం జరుపుకొనే ఉత్సవం మాత్రం అలా నిత్యం కొనసాగుతూనే ఉండాలి. అంటే, మన మాస్టర్లు మన జీవితాలను గడుపవలసిన విధంగా మార్గదర్శకత్వం వహిస్తున్నందుకు వారి పట్ల కృతజ్ఞతతో ఉండటం అన్నమాట. అలా మన జీవితం విప్పారుతున్న కొద్దీ మనం కృతజ్ఞతతో నిండి ఉంటాం.

సహజ మార్గానికి ఒక గొప్ప ప్రత్యేకత ఉంది – ఆ దివ్యలోకానికి (బ్రైటర్ వరల్డ్ కు) వెళ్ళడానికి మనం మృత్యువు వచ్చే వరకూ ఆగనవసరం లేదు. అదేమీ భౌతికపరమైన లోకం కాదు, అది కేవలం ఒక పరిమాణం [Dimension] మాత్రమే. దానిని మన హృదయాల్లో సృష్టించుకోవచ్చు. మన హృదయాల్లో అనుభూతి చెందవచ్చు. మన ఆధ్యాత్మిక అవస్థ (స్థితి) ఎలా ఉండాలంటే, ఈ లోకానికి, ఆ లోకానికీ ఏమీ తేడా లేకుండా ఉండాలి. బాబూజీ స్వీయచరిత్రలో ఒక పేరా గుర్తుకు వస్తోంది, అక్కడ లాలాజీ బాబూజీతో, ఇలా అంటారు, "నేను నీ కోసం ఆ దివ్యలోకాన్ని విడిచిపెట్టేశాను. నీ హృదయమే నా నివాసం అయిపోయింది. ఇక నేను ఆ దివ్యలోకానికి తిరిగి వెళ్ళను" అని అనడం జరిగింది. ఒక్కసారి బాబూజీ తన హృదయంలో తాను సృష్టించుకున్న స్థితి యొక్క స్వచ్ఛతను ఊహించుకోండి. అంతే కాదు, అటువంటి స్థితిని, మనందరమూ, ఇప్పుడే ఇక్కడే,

మన హృదయాన్నే బ్రైటర్ వరల్డ్ గా తయారు చేసుకోవచ్చునని, ఆయన వాగ్దానం చేయడం జరిగింది, హామీ కూడా ఇవ్వడం జరిగింది. అప్పుడు ప్రతి రోజూ ఉత్సవమే.

కాబట్టి మీరందరూ ఆ విధంగా సన్నదం కావాలని కోరుతున్నాను. నేను పదే పదే చెప్తున్నట్లుగా మాస్టర్ల సహాయం ఎప్పుడూ అందుబాటులో ఉండనే ఉంది. మనం ఎప్పుడూ యాచిసూనే ఉంటాం, “మాస్టర్, మాస్టర్ నన్ను ఆశీర్వదించండి. దయచేసి దీనిని ప్రసాదించండి, దాన్ని ప్రసాదించండి” అంటూ యాచిసూనే ఉంటాం. అటువంటి వెగటు పుట్టించే అభ్యర్థనలు చేయడం మానుకోండి. ఏదైన గొప్ప వస్తువును కోరండి, ఏది ఉంటే జీవితంలో మరేదీ అవసరం ఉండదో దాన్ని కోరండి.

ఇక భండారాల విషయానికొస్తే, ఈసారి బాబూజీ జన్మదినోత్సవాలను లక్నోలో జరుపుకొంటున్నాం. భండారాల్లో కొన్ని సంవత్సరాలుగా మనం చూస్తున్నాం, ఆ సమయంలో జనం ఎన్నో విషయాల కోసం వెంపర్లాడటం మనం చూస్తూ వస్తున్నాం. వ్యాపార ఒప్పందాలు జరుగుతూ ఉంటాయి, పెళ్ళిళ్ళు కుదుర్చుకుంటూ ఉంటారు, ఏదో మనం ప్రాణాహుతిని, వారి అనుగ్రహాన్ని పొందగలిగే ప్రదేశం అదొక్కటే అన్నట్లుగా మనలో కొంతమంది మాస్టర్ కాటేజీ చుట్టూ గుమికూడుతూ ఉంటారు. ఈ విధంగా చేయడం ద్వారా మొత్తం గురుపరంపరను అవమానిస్తున్నాం. “నేను లోపలికి వెళ్ళలేకపోతున్నాను. నాకు ప్రాణాహుతి లభించడం లేదు. అది కేవలం హక్కున్న కొంతమందికి మాత్రమేనేమో” అని అనుకుంటూ ఉంటారు. ఈ సంస్థలో హక్కున్నవాళ్ళంటూ ఎవరూ లేరు. వాళ్ళు లైనులో నిలబడతారు. ఎలాగో మధ్యగదిలోకో లేక పడకగదిలోకో వెళ్ళగలుగుతారు. నేను మళ్ళీ మళ్ళీ చెప్తున్నాను, గురువుతో భుజాలు రాసుకుంటూ తిరిగినా సరే, మీ హృదయం సంసిద్ధంగా ఉంటే తప్ప అసలైనదాన్ని సాధించడం జరుగదు. మీ హృదయం సిద్ధంగా ఉన్నట్లయితే, ఆయనకు కొన్ని లక్షల మైళ్ళ దూరంలో ఉన్నా కూడా  అసలైన దాన్ని సాధించగలుగుతారు.

కాబట్టి, దయచేసి ఈ భండారాలను మరింత లోలోతుల్లోకి వెళ్ళే సందర్భాలుగా వీటిని వినియోగించండి; ఆ మాస్టర్ల దివ్య స్మరణలో అత్యంత ప్రేమతో మునిగిపోయి ఉండటానికి, వారి సాన్నిధ్యంలో కరిగిపోవడానికి వినియోగించండి. నేను మిమ్మల్ని కోరుతున్నది అదొక్కటే. కాటేజీ వద్ద గుమికూడి చిన్న చిన్న జీవిత లక్ష్యాలను నెరవేర్చుకోటానికి ఈ భండారాలను పాడు చేసుకోకండి.

అందరికీ ధన్యవాదాలు.